## ఉరి వేసుకొని ఆత్మహత్య



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఈ మేరకు ఎస్ఐ రాజేష్ వివరాల ప్రకారం ఆదివారం గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి (72) తన పాత ఇంటిలో దొతితో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన సూసైడ్ నోట్‌లో మద్యానికి బానిసై, కుటుంబాన్ని సంతోషంగా ఉంచలేక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తన మరణానికి ఎవరు బాధ్యులు కారని రాసుకున్నాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి విచారణ ప్రారంభించనట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

## ఈదురుగాలులకు ఇళ్లు ధ్వంసం



**ప్రజాపక్షం/ నేరడిగొండ:** మండలంలో ఆదివారం కురిసిన ఈదురుగాలుల వానకు గోవింద్‌పూర్, తేజాపూర్ తదితర గ్రామాల్లో భారీ నష్టం వాటిల్లింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయని, గ్రామాలకు చెందిన రాథోడ్ నీలాబాయి, ఆడే సకారం, జాదవ్ భీమ్రావ్, ఆడే పరశురాంలకు చెందిన ఇళ్లు ధ్వంసమయ్యాయని గ్రామస్తులు తెలిపారు. బాధిత కుటుంబాలను నాగమల్యాల్, పీసర సర్పంచ్‌లు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరిగేలా పరిహారం అందిస్తామని భరోసా ఇచ్చారు.

## అక్రమ ఇసుక రవాణా ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న 9 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మోర్తాడ్ మండలంలోని శెట్పల్లి గ్రామం పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో చితా పోలీసులు రంగంలోకి దిగి శెట్పల్లి–పెద్దవాడ నుంచి అక్రమ ఇసుక తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు అలాగే మోర్తాడ్ మండలంలోని ధర్మోరా గ్రామంలోని పెద్దవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను చిత పోలీసులు పట్టుకొని మోర్తాడ్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు మోర్తాడ్ ఎస్ఐ రాము తెలిపారు. మోర్తాడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలలో ఎవరైనా అధికారుల అనుమతి లేనిదే ఇసుక తరలించినట్లయితే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా కఠినమైన చర్యలు చేపడతామని ఎస్ఐ రాము తెలిపారు. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఇసుక అవసరం ఉన్నవారు తప్పనిసరిగా అధికారుల అనుమతి తీసుకొని తీసుకెళ్లాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే వారు ఎవరైనా అధికారుల అనుమతితోనే ఇసుక, అలాగే మొరం తెప్పించుకోవాలని ఎస్సై రాము సూచించారు.

## రాజీ మార్గమే రాజ మార్గం...

### 20 న రెండవ జాతీయ లోక్ అదాలత్: ఎస్పి




**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లాలోని చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భారత ప్రభుత్వ నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, సద్వినియోగపర్చుకోవాలని జిల్లా ఎస్పి డా.జి.జానకీ షర్మిల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కక్షిదారులు కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా ఎస్పి పేర్కొన్నారు. చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన, తక్కువ ఖర్చుతో పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగపర్చుకోవాలని ఎస్పి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఈ నెల 20న జరిగే రెండవ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ డిస్పూట్లు వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు. న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చన్నారు. అంతే కాకుండా, ఇది ఒక శాంతియుత పరిష్కార విధానం కావు, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కోర్టులో గల కేసులను త్వరగా పరిష్కారం చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగంచుకోవాలని ఎస్పి సూచించారు.

## వృద్ధురాలు అదృశ్యం.. కేసు నమోదు



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని శేరిలా గ్రామానికి చెందిన వృద్ధురాలు అదృష్యమైన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. శేరీల గ్రామానికి చెందిన చిన్నింగి వెంకమ్మ (80) శనివారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. ఆదివారం ఉదయం కోడలు లక్ష్మి వెంకమ్మ ఉన్న గదికి వెళ్లి చూడగా ఆమె అక్కడ లేరు. వెంటనే పొరుగు వారికి తెలియజేసి చుట్టుపక్కల ప్రాంతాలన్నీ వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై వెంకమ్మ కోడలు లక్ష్మి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

## గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు



**ప్రజాపక్షం / భైంసా :** కుబీర్ మండలంలోని సాంగ్వీ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలియజేశారు. గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నూతన భవనాన్ని నిర్మించేందుకు ఈ నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ సర్పంచ్ భోజేందర్ తో పాటు నాయకులు ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామస్తుల తరపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

# బడుల్లో ‘బాహ్య’ పరీక్షలు...

### విద్యా ప్రమాణాల మెరుగుకే విద్యాశాఖ కసరత్తు!



**ప్రజాపక్షం / నిర్మల్ :** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి కనీసం రెండో తరగతి పాఠాన్ని కూడా ధారాళంగా చదవలేకపోతున్నాడు. కనీస గణిత సూత్రాలు, కూడికలు, తీసివేతలు తెలియక తలలు పట్టుకుంటున్నారు. కానీ పదో తరగతి వార్షిక ఫలితాలు చూస్తే మాత్రం నిర్మల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఏటా అత్యధిక ఉత్తీర్ణత శాతాలు నమోదవుతున్నాయి. ఈ విరుద్ధమైన క్షేత్రస్థాయి పరిస్థితులే ఇప్పుడు పాఠశాల విద్యాశాఖ పాలకులను, ఉన్నతాధికారును తీవ్ర ఆలోచనలో పడేశాయి. ఈ నేపథ్యంలోనే అసలు లోపం ఎక్కడ జరుగుతోంది? చదవడం, రాయడం వంటి కనీస నైపుణ్యాలు లేని విద్యార్థులు 10వ తరగతి వరకు ఎలా వస్తున్నారు? వార్షిక పరీక్షల్లో ఎలా ఉత్తీర్ణులవుతున్నారు? అనే ప్రశ్నలు జిల్లా విద్యా శాఖ వర్గాల్లో బలంగా వ్యక్తమవుతున్నాయి. దీనికి పరిష్కారంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పూర్తిగా గాడిలో పెట్టేందుకు సరికొత్త విప్లవాత్మక మార్పులకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటి వరకు పాఠశాలల పరిధులకే పరిమితమైన అంతర్గత పరీక్షల విధానానికి స్వస్తి పలికి, సర్కారు బడుల్లో సరికొత్త బాహ్య మూల్యాంకన విధానాన్ని ప్రయోగాత్మకంగా నిర్వహించాలని విద్యాశాఖ యోచిస్తోంది. ప్రభుత్వ పర్యవేక్షకుల అకస్మిక తనిఖీల తరహాలోనే, విద్యార్థులకు కూడా ఏలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆకస్మికంగా పరీక్షలు నిర్వహించేందుకు ఉన్నత స్థాయి ప్రణాళికలు సిద్ధమతున్నాయి. ఇందుకు ప్రభుత్వ అంగీకారం కోరగా, అంతా సవ్యంగా కుదిరితే వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఈ నూతన పరీక్షల విధానం అమలు కానుంది.

### ప్రస్తుత అంతర్గత విధానంలో లోపాలు..

ప్రస్తుతం జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిరంతర సమగ్ర మూల్యాంకన విధానం అమలులో ఉంది. ఇందులో భాగంగా విద్యార్థులు చదువుతున్న పాఠశాల ఉపాధ్యాయులే వారి ప్రతిభను పరీక్షిస్తూ వివిధ రకాల అంతర్గత సామర్థ్య పరీక్షల పేరుతో మార్కులు వేస్తున్నారు. అయితే ఈ విధానం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని, ఉపాధ్యాయులు తమ పాఠశాలల ఫలితాలను ఎక్కువగా చూపించుకునేందుకు మార్కులు ఎక్కువగా వేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల విడుదలైన జాతీయ సాధనా సర్వే నివేదికలు కూడా సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాల క్షీణతను స్పష్టంగా కళ్లకు కట్టాయి. తాము చదువుతున్న ప్రస్తుత తరగతి పాఠాలే కాకుండా, ఐదారేళ్ల క్రితం ప్రాథమిక తరగతుల్లో నేర్చుకోవాల్సిన భాషా జ్ఞానాన్ని కనీస గణితాంశాలను సైతం విద్యార్థులు మర్చిపోతున్నట్లు ఆ సర్వేలో వెల్లడైంది. ఇలాంటి పరిణామాలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బ తీస్తాయని, ఇప్పుడే సరైన చర్యలు తీసుకోకపోతే విద్యా ప్రమాణాలు మరింత దిగజారుతాయని విద్యా శాఖ తీవ్ర ఆందోళన చెందుతోంది.

### ఏటా రెండుసార్లు ఆకస్మిక పరీక్షలు..

విద్యాశాఖ ప్రతిపాధించిన కొత్త బాహ్య మూల్యాంకన విధానం పూర్తి పారదర్శకంగా, నిష్పాక్షికంగా, అత్యంత కఠినంగా సాగనుంది. దీని ప్రకారం ప్రతీ విద్యా సంవత్సరం విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరీక్షించడానికి రెండుసార్లు ఈ బాహ్య పరీక్షలను నిర్వహిస్తారు. అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ పరీక్షల నిర్వహణలో సదరు పాఠశాల ఉపాధ్యాయులకు ఏలాంటి ప్రమేయం గానీ, జోక్యం గానీ ఉండదు. యాధృచ్చిక పద్ధతిలో ఇతర పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఈ పరీక్షల నిర్వహణకు పర్యవేక్షకులుగా పంపుతారు. ఏ సబ్జెక్టు పరీక్ష, ఏ రోజు, ఏ సమయానికి జరుగుతుందనే విషయాలను అత్యంత గోప్యంగా ఉంచుతారు. జిల్లా స్థాయి పర్యవేక్షక బృందం ఆకస్మికంగా బడికి చేరుకుని ప్రశ్నపత్రాలను అందించి పరీక్ష నిర్వహిస్తుంది. దీనివల్ల విద్యార్థులు నిరంతరం చదువుపై శ్రద్ధ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పరీక్షల నిర్వహణతోనే సరిపెట్టకుండా, విద్యార్థులు రాసిన జవాబు పత్రాల మూల్యాంకనంలోనూ విద్యాశాఖ కఠినమైన నిబంధనలను తీసుకురానుంది. పరీక్షలు పూర్తయిన వెంటనే ఆ జవాబు పత్రాలను సేకరించి, మరో పాఠశాల ఉపాధ్యాయులతో మూల్యాంకనం చేయిస్తారు. ఆయా సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు వచ్చిన మార్కులను వెనువెంటనే పాఠశాల విద్యా శాఖకు చెందిన అధికారిక అంతర్జాలంలో పొందుపరుస్తారు. దీని ద్వారా ఏ పాఠశాల లోని విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో, ఏయే అంశాల్లో వెనుబడ్డారో ఉన్నతాధికారులకు స్పష్టమైన అవగాహన వస్తుంది. ఆ లోపాలను సరిదిద్దేందుకు, విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు వెనువెంటనే ప్రత్యేక తరగతులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక బోధనా శిక్షణను నిర్వహిస్తారు.

## నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాపక్షం / నర్సాపూర్ (జి) :** నర్సాపూర్ (జి) మండలంలోని అంజనీ, నర్సాపూర్‌జి, గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు స్థానిక బిజెఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, క్యాంపు కార్యాలయం నుంచి సమాచారం అందించారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

# కార్మిక ఉద్యమ యోధుడు ‘మునీర్’

### మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం / మందమర్రి :** కార్మిక హక్కుల కోసం జీవితాంతం పోరాడిన సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు మునీర్ సేవలు అపూర్వమని రాష్ట్ర కార్మిక, గనులు, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కొనియాడారు. మందమర్రి పట్టణంలోని సిఇఆర్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ‘మునీర్ భాయ్ – ప్రొలిటేరియన్’ జర్నలిస్టు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ప్రజా నాయకుడు ప్రొ. కోదండరామ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు హాజరయ్యారు. అంతకుముందు ము నీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మునీర్‌తో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జర్నలిస్టుగా మాత్రమే కాకుండా కార్మికుల గొంతుకగా, సామాజిక చైతన్యవేత్తగా, ఉద్యమ స్ఫూర్తిగా ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి జెఎసి చైర్మన్‌గా వేలాది మంది కార్మికులను ఏకతాటిపైకి తీసుకువచ్చి ఉద్యమ విజయానికి కీలకంగా దోహదపడ్డారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను కలం తో వెలుగులోకి తీసుకువచ్చిన మునీర్, కార్మిక వర్గ హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన యోధుడని వక్తలు అభివర్ణించారు. ఆయన జీవితం నేటి యువ జర్నలిస్టులకు, ఉద్యమకారులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ పుస్తకం ద్వారా మునీర్ జీవన ప్రస్థానం, ఉ ద్య మ చరిత్ర, జర్నలిజంలో ఆయన చూ పిన నిబద్ధత భావితరాలకు చేరువవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మిక లోకానికి అంకితమైన మునీర్ సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రజా నాయకుడు ప్రొ. కోదండరామ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## గంజాయి వినియోగంపై స్నిఫర్ డాగ్ నిఘా



**ప్రజాపక్షం/ నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మండలంలో ఈగల్ టీమ్, నేరడిగొండ పోలీసులు ఆదివారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. గంజాయి వినియోగదారులు, అనుమానితులను లక్ష్యంగా చేసుకుని స్నిఫర్ డాగ్ (జాగిలం) సహాయంతో నేరడిగొండ, వడుర్ గ్రామాల్లోని పరిసర ప్రాంతాలతో పాటు ఆర్‌టిసి బస్సుల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఎస్ఐ ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల కట్టడి కోసం నిరంతరం జాగిలాలతో నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వినియోగిస్తే ఈ జాగిలాలు ఇట్టే కనిపెడతాయని, ఎవరూ కూడా గంజాయి వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భీమ్‌గల్ అభివృద్ధి పనులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం

### నెల రోజుల్లో ప్రారంభించకుంటే ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాడుతుంది
### మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** బిఆర్ఎస్ హయాంలో భీమ్‌గల్ పట్టణ అభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులు నిలిచిపోయిన పనుల స్థితిగతులపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన బిఆర్ఎస్ నాయకులతో కలిసి పట్టణంలోని పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌పై విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వ హయాంలో భీమ్‌గల్ పట్టణ రూపురేఖలు మార్చటానికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయించామని గుర్తు చేశారు. రూ.22 కోట్ల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం, నిరుపేదలకు నాణ్యమైన వసతులు అందించేందుకు రూ.22 కోట్లతో మార్కెట్ భవన పనులు ప్రారంభించి రూ.16 కోట్ల పనులు పూర్తి చేయించామన్నారు. కాంట్రాక్టర్‌కు రూ.13 కోట్ల నిధులు కూడా విడుదల చేశామని, కానీ మిగిలిన పనులను పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల సమయం తీసుకుందని మండిపడ్డారు.

**మహేష్‌కుమార్‌గౌడ్‌కు సవాల్ :** మున్సిపల్ ఎన్నికల సమయంలో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ రూ.5కోట్ల నిధులు మంజూరు చేస్తానని మాటిచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా పైసా విదిల్చలేదని, ఆయనకు తాను సవాల్ విసురుతున్నాన్నారు. ఓడినా, గెలిచినా బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాడుతుందని ఎమ్మెల్యే వేముల స్పష్టం చేశారు

## రక్తదానం సామాజిక బాధ్యత

### ఎమ్మెల్యే పాల్వాయి హరీష్



**ప్రజాపక్షం / కాగజ్ నగర్:** రక్తదాతలే ప్రాణదాతలని, రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని సిర్పూర్ ఎంఎల్ఎ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్ నగర్ పట్టణంలోని అగ్రసేన్ భవన్‌లో మార్వాడి యువ మంచ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అవసరమైన సమయంలో రక్తదానం చేయడం వల్ల అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఏడాదిలో కనీసం రెండుసార్లు రక్తదానం చేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. రక్తదానం వల్ల దాతకు ఎలాంటి నష్టం ఉండదని, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. అనంతరం రక్తదానం చేసిన వారిని సన్మానించి మొమెంటోలు అందజేశారు. ఈ శిబిరంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప పోలీస్ సూపరింటెండెంట్ వహీదుద్దీన్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్, డాక్టర్ కృష్ణారావు, శివ గౌడ్, మురళీ కృష్ణ జవర్, కపిల్ సోనీ, శుభం లోయ, అభిషేక్ సోనీ, హితేష్ అగర్వాల్, వివేక్ బజాజ్, గోవింద్ అసావా పాల్గొన్నారు.

## జులై 19న ఎఐటియుసి జిల్లా మహాసభలు




**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** వచ్చే నెల జూలై 19న ఎఐటియుసి ఆదిలాబాద్ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ అధ్యక్షతన, రాష్ట్ర ఇంచార్జి వీఎస్ బోస్ ముఖ్య అతిథిగా ఆదివారం రాష్ట్ర సమితి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా నివేదికను ప్రవేశపెట్టిన అనంతరం సిర్ర దేవేందర్ మాట్లాడుతూ జిల్లా మహాసభల్లో అన్ని రంగాల కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఇతర సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ సభలను జయప్రదం చేయడం ద్వారా సెప్టెంబర్ 6,7,8 తేదీలలో కరీంనగర్‌లో జరిగే 4వ రాష్ట్ర మహాసభల విజయవంతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం. నర్సింహా, ఎస్. విలాస్, ప్రేమ్ పావని, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# యాప్‌లో యూరియా మాయం..రైతుల ఆగ్రహం




**ప్రజాపక్షం / పెంచికల్‌పేట్ :** యాప్‌లో యూరియా స్టాక్ నిమిషాల వ్యవధిలోనే మాయం కావడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలో యూరియా ఎరువుల పంపిణీ వ్యవహారం రైతుల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. మండలానికి యూరియా వచ్చిన సమాచారం రైతులకు ముందస్తుగా తెలియజేయకుండా, కొందరికి మాత్రమే చేరుతోందని ఆరోపిస్తున్నారు. యాప్‌లో బుకింగ్ ప్రారంభమైన కొద్ది క్షణాల్లోనే స్టాక్ ముగిసిందని చూపించడం వెనుక అసలు కారణాలపై వ్యవసాయ శాఖ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. విత్తనాలు వేసే కీలక సమయంలో ఎరువులు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ సంబంధిత అధికారులు సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టడం లేదని ఆరోపిస్తున్నారు. కొంతమంది వ్యాపారులు రైతుల పేర్లతో యూరియా బుక్ చేసుకుని, అనంతరం అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో యూరియా బ్యాగ్‌పై నిర్ణీత ధర కంటే ఎక్కువ మొత్తాన్ని వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. యూరియా స్టాక్ వివరాలను ముందుగానే బహిరంగంగా ప్రకటించాలని, ప్రతి పట్టాదారు రైతుకు న్యాయంగా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. యాప్ బుకింగ్ వ్యవస్థపై సాంకేతిక, పరిపాలనా విచారణ జరిపి, బ్లాక్ మార్కెట్, అధిక ధరల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. యూరియా పంపిణీలో పారదర్శకత లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# 60 ఏళ్లలో ఓటు, సీటు చోరీ చేసింది కాంగ్రెస్ పార్టీనే

### శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు రండి
### బిజెపి 8 మంది ఎంపీలు రాజీనామాకు సిద్ధం
### సిఎం రేవంత్‌కు ఎంపి రఘునందన్ సవాల్



**ప్రజాపక్షం/మెదక్ :** భారతదేశ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత ఓటు, సీటు చోరీ, జవహర్ లాల్ నెహ్రూను ప్రధానిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందని, ఓటు, సీటు కోసం చరిత్ర చదివితే రేవంత్‌రెడ్డికి తెలుస్తుందని చదువు రాని ఆయనకి ఏం తెలుస్తుందని మెదక్ ఎంపి రఘునందన్ రావు విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడిచిన ఘనత కాంగ్రెస్ పార్టీదేని ఎద్దేవా చేశారు. 4339 రోజుల ప్రధానమంత్రి పదవీకాలం పేద ప్రజల విశ్వాసం, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న మోదీ పాలనకు నిదర్శనమని స్పష్టం చేశారు. ఆదివారం మెదక్ బిజెపి కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్, జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌తో కలిసి ఎంపి రఘునందన్‌రావు విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై సిఎం రేవంత్ రెడ్డి చేసి వ్యాఖ్యలపై శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు వస్తే బిజెపికి చెందిన 8 మంది ఎంపిలు రాజీనామా చేయడానికి సిద్ధమని సిఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ధాన్యం సకాలంలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, సిఎం ఢిల్లీ పర్యటనలు, కాంగ్రెస్‌లో కుర్చీల పోరాటమే ఎక్కువగా కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశా రు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి వేగంగా సాగుతోందని పేర్కొన్న రఘునందన్ రావు, జాతీయ రహదారులు, రైతు సంక్షేమ పథకాలు, జనధన్ ఖాతాల ద్వారా దేశం పురోగతి సాధించిందన్నారు. ప్రజల ఆశీస్సులతో బిజెపి మరింత బలోపేతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు అఖిల భరత్, రాజమణి, సర్పంచ్ జెండే వీణ, నాయకులు కవితారెడ్డి, రాములు, ఎంఎల్ఎన్ రెడ్డి, రంజిత్ రెడ్డి, బిక్షపతి, జనార్ధన్, సురేష్ తదితరులు ఉన్నారు.

## ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలి

### టియుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం డిమాండ్

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం ముఖ్య అతిథిగా పాల్గొనన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగ ఉపాధ్యాయుల మే నెల వేతనం నుండి 1.5 శాతం ఇహెచ్ఎస్ చందా వసూలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మార్గదర్శకాలు రూపొందించకపోవడం శోచనీయమన్నారు. వెంటనే అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో అమలయ్యే విధంగా ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 30 తేదీ లోపు రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని వస్తున్న వార్తల పట్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1:9 విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండాలని 60 మంది విద్యార్థులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాలని, ఆపైన ప్రతి 20 మందికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తోడిశెట్టి రవికాంత్, వహీద్ ఖాన్, రాష్ట్ర సహోద్యక్షులు ఎ.లక్ష్మి ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శరత్ చందర్‌రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ముత్తన్న జిల్లా కోశాధికారి, మేడారపు శ్రీనివాస్, నాయకులు ఎస్.పాండురంగాచారి, పోల దర్మరాజ్ పాల్గొన్నారు.

